క్లుప్తంగా

విద్యార్థులకు కెనరా బ్యాంక్ ఉపకార వేతనాలు



పెదకాకాని: విద్యా జ్యోతి పథకం కింద పెద కాకాని కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం పెదకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. పాఠశాలలో ఐదు నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఈ ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కెనరాబ్యాంక్ సీనియర్ మేనేజర్ మన్నెం సీతారామయ్య, ఏఈఓ అంకిత, పాఠశాల హెచ్ఎం కె.భాస్కరరావు, అసిస్టెంట్ హెచ్ఎం జి.శాంతి, కెనరా బ్యాంకు సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణతో కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

నెహ్రూనగర్: కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యుల రైజ్ చేస్తూ సీఎం వై.ఎస్. జగన్ సంతకం చేయడంపై ఐడియల్ దళిత్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఐడియా) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు హర్షం వ్యక్తం చేశారు. అంకమ్మనగర్‌లోని సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేసేందుకు సీఎం చొరవ చూపడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు మోసం చేశాయని, కాని సీఎం వై.ఎస్. జగన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని, రెగ్యులరైజ్ చేయడంతో వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు.

నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ హాలులో ప్రారంభం కానుంది. సభ్యుల ప్రశ్నలు, ప్రతిపాదనలు, నగరపాలక సంస్థ ప్రస్తావనలు కలిపి మొత్తం 359 అంశాలపై కౌన్సిల్ సమావేశం జరగనుంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: బ్రాడీపేట విద్యుత్ ఏఈ కార్యాలయం పరిధిలోని అరండల్‌పేటలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ ముస్తాక్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

➡ చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా డీ–13 పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సీతారామ్‌నగర్, అంబేడ్కర్ నగర్, కాకాని మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

మహిళను వేధిస్తున్న భర్త, అత్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భర్త, అత్త కలసి మహిళను వేధిస్తున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుండ్లకు చెందిన పఠాన్ నజీర్, ఆరీఫాలకు నాలుగు సంవత్సరాల కిందట వివాహమైంది. ఇద్దరు సంతానం. కుటుంబ కలహాలతో ఆరీఫాను నజీర్, అతని తల్లి ఖాశీంబీ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బుధవారం ఆరీఫాపై నజీర్ వేడి గంజి పోశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

తెనాలి టౌన్: పట్టణంలోని జైభీమ్ కార్యాలయంలో బుధవారం విప్లవ గాయకుడు కామ్రేడ్ గద్దర్ సంస్మరణ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు దేవానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం గద్దర్ చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తినిచ్చాయన్నారు. ఆయన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. గద్దర్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సలహాదారులు అబ్రహం లింకన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.భూషణం, న్యాయవాది మానుకొండ లెనిన్‌వర్మ, కె.రామారావు, దాసరి వెంకటేశ్వరరావు, బాబు, పీటర్‌పాల్, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వలో మృతదేహం

తెనాలి రూరల్: పెదరావూరు కాల్వలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గ్రామంలో చినపల్లె వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వెంబడి వంతెన వద్ద కాల్వలో చెత్తలో పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు బుధవారం సాయంత్రం సమాచారమిచ్చారు. అప్పటికే చీకటి పడడంతో మృతదేహాన్ని కాల్వలో నుంచి తీయడానికి వీలు కాలేదు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, మృతి చెంది నాలుగు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. గురువారం మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం కోసం పంపుతామని పోలీసులు తెలిపారు.

విధుల్లో అలసత్వం తగదు

- కొందరు అధికారుల పనితీరు కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు
- చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన వారికి బిల్లులు జాప్యం కావటానికి కొందరు అధికారుల అలసత్వమే కారణమని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కొందరు సిబ్బంది తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరై, పనులు చేసిన వాటికి బిల్లులు జాప్యం కావటానికి కొందరి అధికారుల తీరే కారణమన్నారు. పనులు పూర్తి అయినప్పటికీ సిబ్బంది ఎం.బుక్ నమోదు చేయకపోవటం, అప్‌లోడ్ చేయకపోవటం వంటి కారణాలతో ఆలస్యం అవుతుందన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండటం లేదన్నారు. అభివృద్ధి పనులు మొదలు పెట్టకుండా ఉన్నవాటిని వేరొకరికి అప్పగించాలన్నారు. శేకూరు, చేబ్రోలు తదితర గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్‌బీకేలు త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. సెప్టెంబర్ మొదటి వారానికి అన్నిచోట్ల పూర్తి చేసే విధంగా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఏఓ బి.శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు ఆర్‌బీకేల్లో పూర్తిస్థాయిలో నిల్వలు ఉన్నాయన్నారు. సీసీఆర్‌సీ కార్డులు, పంట నమోదు, పంటల బీమా తదితర అంశాల గురించి సమావేశంలో వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సమావేశానికి సమాచారం లేకుండా రాకపోవటంపై మెమో ఇవ్వాలని ఎంపీడీఓకు ఎమ్మెల్యే సూచించారు. నాడు – నేడు పనులు నాణ్యత ప్రమాణాలతో సక్రమంగా జరిగే విధంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

ఆక్రమణలను వెంటనే తొలగించండి...

నారాకోడూరు, చేబ్రోలు ప్రాంతాల్లో ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా అధికారులు శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలులోని అప్పాపురం చానల్ పక్కన ఇరిగేషన్, ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణలకు గురై నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని తొలగించాలని గత సమావేశంలో చెప్పినప్పటికీ అమలు చేయకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించాని ఆదేశించారు. నారాకోడూరులో ప్రధాన రహదారి పక్కన, చేబ్రోలులోని ఆక్రమణలను వెంటనే తొలగించాలని తెలిపారు. వేజండ్ల గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అధికారులు రికార్డులు పరిశీలించి, పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహించాలన్నారు. జిల్లా ఉత్తమ తహసీల్దారుగా అవార్డు అందుకున్న చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణను ఎమ్మెల్యే కిలారి అభినందించారు. శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను రెండు నెలల క్రితం తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన గోపాలకృష్ణ త్వరతగతిన పరిష్కరించటం ఆయన పనితీరుకు నిదర్శనమన్నారు. వైస్ ఎంపీపీలు పసుపులేటి శ్రీనివాసరావు, కాసు అనిత, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ బి.బాబురావు వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణ 60 అడుగులే..

- టీడీపీ నేతల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



టిడ్కో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: పొన్నూరు పట్టణ అభివృద్ధికై చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కిలారి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జీబీసీ రోడ్డు విస్తరణ పనులకు భవన యజమానులు సహకారాన్ని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు రోడ్డు విస్తరణ 60 అడుగులు కాదు 80 అడుగులని భవన యజమానులకు అనుమానాలు రేకెత్తించేవిధంగా దుష్ప్రచారాలు, చేస్తున్నారన్నారు. భవన యజమానులు వీటిని నమ్మవద్దన్నారు. భవనాల తొలగింపు ప్రాంతంలో వచ్చేనెల మొదటి వారంలో డ్రైన్లు, రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పట్టణంలో ప్రధాన ట్రాఫిక్ సమస్యగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. 25 ఏళ్లలో చేయలేనిది నాలుగేళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామన్నారు. రానున్న కాలంలో రూ.6.7 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్ల, బొద్దులూరి రంగారావు, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

టిడ్కో మంజూరు పత్రాలు అందజేత...

పేదలందరికీ గృహ నిర్మాణాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరులో బుధవారం ఇరువురికి టిడ్కో గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. పట్టణానికి చెందిన ఇరువురు పేదలైన పి.మాలతి, కొండముది ఉమాదేవిలకు టిట్కో గృహాల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే రోశయ్య చేతుల మీదుగా అందజేశారు. లబ్దిదారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు , కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువులో చేపల వేట



వలలో చిక్కిన భారీ చేపలు

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): నిబంధనలకు విరుద్ధంగా కొందరు మంచి నీటి చెరువులో చేపల వేట చేపట్టారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు రక్షిత మంచినీటి చెరువులో తాగునీరు అడుగంటాయి. దీంతో స్థానికులు చెరువులో చేపలు ఉన్నాయని, బహిరంగ వేలం నిర్వహిస్తే పంచాయతీకి ఎంతో కొంత ఆదాయం వస్తుందని స్థానిక పంచాయతీ అధికారులకు తెలిపారు. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చెయ్యలేదు. మంచినీటి చెరువులో చేపలు పట్టకూడదన్న కారణాన్ని చూపి వేలాన్ని విస్మరించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కొందరు జాలర్లు చెరువులోకి దిగి పెద్ద పెద్ద చేపలను పట్టి, అక్కడికక్కడే చేపలను బహిరంగంగానే విక్రయించారు. ఒక్కో చేప భారీగా ఉందని స్థానికులు తెలిపారు. అయితే పంచాయతీ అధికారులకు విషయం తెలియడంతో సిబ్బందిని పంపి జాలర్లను పంపివేశారు. కాగా పట్టపగలు బహిరంగంగా కొందరు వ్యక్తులు మంచినీటి చెరువులో చేపలు పట్టడంపై స్థానికుల నుంచి పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ అధికారుల సహకారంతోనే జాలర్లు చేపలు పట్టి ఉంటారన్న ఆరోపణలూ లేకపోలేదు. ఇటీవలే ఆ పంచాయతీలో నిధుల దుర్వినియోగం విషయంలో టీడీపీ సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే.

నాయకత్వ లక్షణాలతోనే ముందడుగు

గుంటూరు ఎడ్యుకేషన్: గృహ కార్మికులంతా నాయకత్వ లక్షణాల్ని అలవర్చుకోవాలని కోల్పింగ్ సొసైటీ న్యాయవాది ప్రభుదాస్ పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో బుధవారం అంథేరీ హిల్స్, మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గృహ కార్మికులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుదాస్ మాట్లాడుతూ పేదవారిలో నాయకత్వ సామర్థ్యాల్ని పెంపొందించడం, స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు కావడం, మహిళా సాధికారత కల్పించడంపై అవగాహన పొందాలని సూచించారు. ఆర్థికాభివృద్ధి, పొదుపు, ఆర్థిక లావాదేవీలు, రుణాల గురించి వివరించారు. స్వీయ సహాయం ఉత్తమ సహాయమని, ఐక్యత బలమని, గృహ కార్మిక మహిళలు సమష్టిగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ఎంఎస్‌ఐ కో–ఆర్డినేటర్ సిస్టర్ వ్యాకుల మేరీ, సెయింట్ మనో వికాస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఐడా పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు పీఎస్‌లో జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, ఎస్‌ఐ కోటేశ్వరరావుతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

గుంటూరు రూరల్: గ్రామాల్లో శాంతికమిటీలను ఏర్పాటు చేసి శాంతి భద్రతలను కాపాడే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ సూచించారు. బుధవారం సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని వట్టిచెరుకూరు మండల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. వట్టిచెరుకూరులో నూతన పోలీసు స్టేషన్ నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ తీర్మానం చేసి, ఆమోదం పొందిన స్థలాన్ని పరిశీలించి పోలీసు స్టేషన్ నిర్మించే దిశగా తదుపరి కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన కొంతమంది ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో నమోదైన కేసులపై దృష్టి సారించి, దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, ఇతర విశేషాలను స్థానిక ఎస్‌ఐ కోటేశ్వరరావుని అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ సీఐ సుబ్బారావు, స్థానిక ఎస్సై కోటేశ్వరరావులకు పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఫిర్యాదులను పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఫిర్యాదుకు తప్పకుండా రిసెప్షన్ రిజిస్టార్‌లో రాయడం, రశీదు ఇవ్వడం చేయాలన్నారు. పోలీసు స్టేషన్‌లో న్యాయం జరుగుతుందని అనే నమ్మకం ప్రజలకు ఫిర్యాదుదారులకు కలిగించాలని ఎస్‌ఐకు సూచించారు. స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ ఒక గ్రామం విజిట్ చేసి ఆ గ్రామానికి సంబంధించిన సమాచారం తెలుసుకుని ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకోవాలని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు రౌడీషీటర్ల, సస్పెక్ట్ కలిగిన వారిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. రాత్రి సమయంలో నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బంది మండల పరిధిలో ఉన్న గ్రామాలలో ముందస్తు సమాచారం తెలుసుకొని శాంతి భద్రతలను అదుపులో ఉండేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. స్టేషన్ పరిధిలో వున్న ముఖ్య గ్రామాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయంలో స్టేషన్‌కు సంబంధించిన పోలీసులను కాలేజీల దగ్గర, స్కూల్స్ దగ్గర విజిబుల్‌గా ఉండే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. గుంటూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుభాష్, సీసీ శ్రీనివాసరావు ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



మృతి చెందిన కీర్తన

ప్రత్తిపాడు: మనస్థాపంతో ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గుంటూరు ఎల్ఆర్ కాలనీ సంగడిగుంటకు చెందిన హిమకీర్తన(24) ఉరఫ్ కీర్తికి 2017లో ప్రత్తిపాడుకు చెందిన బోలె వాసుతో వివాహం అయ్యింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 1వ తేదీన కీర్తన భర్త వాసుతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి, తన స్నేహితురాలి ఇంట్లో ఉంది. కీర్తన కుటుంబీకులు గుంటూరులోని లాలాపేట పోలీస్ స్టేషనులో ఫిర్యాదు ఇవ్వడంతో కీర్తనను వెతికి పోలీసులు తల్లికి అప్పగించారు. అనంతరం ఈ నెల 7వ తేదీన పెద్ద మనుషులతో మాట్లాడి కుమార్తెను కాపురానికి పంపారు. అప్పటి నుంచి కీర్తన భర్తతో కలిసి ప్రత్తిపాడులోనే నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో గతంలో భార్యభర్తల మధ్య జరిగిన గొడవలు, ఇంటి నుంచి వెళ్లి పోవడం వంటివి గుర్తుకు రావడంతో కీర్తన తీవ్ర మనస్థాపానికి గురయ్యింది. ఈనెల 10వ తేదీన ఇంట్లో ఎలుకల మందు పేస్టును నీటిలో కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వాంతులతో బాధపడుతున్న కీర్తనను చూసిన కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి తల్లి బి.పద్మావతి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు.

గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి చేద్దాం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు
- ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



సర్దార్ గౌతు లచ్చన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం, గౌడ సంఘం నాయకులు

పెదకాకాని: స్వాతంత్ర్య ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరువ కావాలన్న సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి చేద్దామని పొమర్తి సాంబశివరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరావు పిలుపునిచ్చారు. పెదకాకాని గౌడ సంఘం ఆధ్వర్యంలో పెదకాకాని మెయిన్ సెంటర్‌లో జరిగిన గౌతు లచ్చన జయంతి వేడుకలకు శంకరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెంటర్లో ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలను అన్ని వర్గాలకు చేరువ చేసేందుకు గౌతు లచ్చన జీవిత చరమాంకం వరకు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆయన పోరాటం బహుజనులకు ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు. ఆయన చూపిన బాటలో మనమంతా పయనించి, ఆయన ఆశయసాధనకై దీక్షబూనాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, స్కూల్ పిల్లలకు ఎగ్జామ్ మెటీరియల్ అందించారు. స్వీట్లు, అల్పాహారం పంపిణీ చేశారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు వీరంకి రంగారావు, పెదకాకాని గౌడ్ సంఘం నాయకులు కారంకి లక్ష్మీనారాయణ, రేఖా ప్రసాదరావు, డాక్టర్ శివాజీ, కోసూరి పూర్ణచంద్రరావు, కుక్కల మల్లిఖార్జున రావు, వడ్లమూడి నాగరాజు తదితరులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా హైదరాబాదులో సెప్టెంబర్ మూడో తేదీన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సర్వేజనాః సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక, సేవాసంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్. నారాయణ మాస్టారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఉపాధ్యాయ, అధ్యాపకులు ఈనెల 25వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వివరాలకు 9652347207లో సంప్రదించాలని తెలిపారు.

వ్యవసాయానికి ఊతం.. అన్నదాతకు ప్రోత్సాహం

- రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- అన్నదాతల చెంతకే సంక్షేమ పథకాలు
- ఆర్‌బీకేలు, కేవీకేలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో లాభసాటిగా వ్యవసాయం



సాగులో ఉన్న పత్తి పంట

గుంటూరు రూరల్: రైతును రాజును చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను రైతుల చెంతకే చేరుస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎప్పటికప్పుడు అందజేస్తూ రైతుల వ్యవసాయ అభివృద్ధికి పాటుపడుతున్నారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, క్షేత్రస్థాయి పరిశోధనలు, నిర్వహిస్తున్నారు. రైతులకు అవసరమైన ఆధునిక వ్యవసాయం యాజమాన్య పద్ధతులకోసం ఎప్పటికప్పుడు రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో రైతు ముఖాముఖి కార్యక్రమాలు, శిక్షణ తరగతులు, నిర్వహిస్తున్నారు. అదేవిధంగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు అవసరమైన సేంద్రియ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను సబ్సిడీపై అందజేస్తున్నారు. అదేవిధంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తూ నేడు డ్రోన్‌ల ద్వారా వ్యవసాయం చేసేందుకు రైతులకు ఇప్పటికే ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహించారు.

సమృద్ధిగా విత్తనాలు.. ఎరువులు

ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా పత్తి పంటను 4,805 ఎకరాలు, వరి పంటను 1255 ఎకరాలు, మిరప 95 హెక్టార్లు సోయాబీన్ 49 ఎకరాలు, మేతజొన్న 200 ఎకరాలు, కూరగాయలు 100 ఎకరాలు మొత్తం 6,504 ఎకరాల్లో పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డీఏపీ 571 టన్నులు, యూరియా 100 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 30 మెట్రిక్ టన్నులను వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంచారు. మండలంలో జొన్నలగడ్డ గ్రామంలో వరి పంటకోసం రైతులకు విత్తనంగా 30 క్వింటాళ్లు, ఓబులునాయుడుపాలెం గ్రామంలో 10 క్వింటాళ్ల విత్తనం అందజేయగా రైతులు ప్రస్తుతం సాగు చేస్తున్నారు. అదేవిధంగా పత్తి విత్తనాల ప్యాకెట్లను వ్యవసాయ శాఖనుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటికే ఓబులునాయుడు పాలెంకు 150 ప్యాకెట్లు, లాలుపురంకు 100 ప్యాకెట్లు, చల్లావారిపాలెంకు 60 ప్యాకెట్లు, మల్లవరంకు 90 ప్యాకెట్లు ఇతర గ్రామాలకు రైతుల అవసరాన్ని బట్టి పత్తి విత్తనాలు అందజేశారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

కౌలు రైతు కార్డుల ద్వారా పంటల రుణాలు సైతం ఇప్పటికే నియోజకవర్గంలోని 270 మంది కౌలు రైతులకు రూ.2.70 కోట్లు రైతులకు ప్రభుత్వం అందించింది. డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా ఒక్కో రైతుకు రూ 13,500 వంతున 4970 మంది రైతులకు గానూ ఇప్పటికే రూ 6.71 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయటం జరిగింది. అదేవిధంగా పంటనష్టాలను సైతం ఎప్పటికప్పుడు అంచనాలు వేసి నష్టాలను రైతుల ఖాతాల్లో జమ చేయటం జరిగింది. ఈ విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను రైతులకు అందజేస్తూ రైతులు, రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నారు.

రైతు సాధికారతకు వ్యవసాయ శాఖ కృషి



రైతు సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వ్యవసాయశాఖ కృషిచేస్తుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల వసతులను కల్పించాం. ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేశాం. రైతులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటున్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నాం. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను ప్రభుత్వం కల్పించింది.

– ఐ.సుబ్రమణ్యం, మండల వ్యవసాయ శాఖ అధికారి

రైతును రాజును చేసిన ప్రభుత్వం



రైతును రాజును చేసేవిధంగా జగనన్న సంక్షేమ పథకాలు రైతులకు అందుతున్నాయి. మాకు ఎల్లప్పుడూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందుతున్నాయి. గత 20 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా రైంతాంగ సంక్షేమం జరుగుతుంది. వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తల సలహాలతో వ్యవసాయం చేస్తున్నాం. క్రమేణా వ్యవసాయం లాభసాటిగా తయారైంది.

– వంగా నవీన్‌రెడ్డి, సేంద్రియ ఐతు, జొన్నలగడ్డ



సంస్థ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు చెబుతున్న ట్రిపుల్ ఎక్స్ సోప్స్ సంస్థ చైర్మన్ ఎ.మాణిక్యవేల్ – గుంటూరు రూరల్